# రేపటి దాకా ఆగు!

సిటీ బస్‌లో కూర్చున్న రమణయ్య ముందు సీట్లో కూర్చున్న సుబ్బయ్యశెట్టిని చూసి ఉలిక్కిపడ్డాడు. 'శనిగ్రహం యిక్కడికీ వచ్చేడూ' అనుకున్నాడు. అతనికి వణుకు ప్రారంభించింది. దిగవలసిన స్టేషన్ ఇంకా రానప్పటికీ ముందు స్టేషన్ దగ్గిరే దిగిపోయి, 'అమ్మయ్య!' అను కున్నాడు.

సుబ్బయ్య శెట్టికి మంచీ మర్యాదా తెలియవు. సుబ్బయ్య శెట్టికే కాదు. అసలు అప్పులిచ్చిన వాళ్లెవరికీ మంచీ మర్యాదా తెలియవు. ఎక్కడ కనబడితే అక్కడ నిలబెట్టి మరీ అడుగుతారు. అనుభవం మీద రమణయ్య గ్రహించిన నిజం యిది.

కాఫీ హోటళ్లకు ఉండే ఆకర్షణశక్తి రమణయ్య ముందు పని చేయదు. కానీ అతను కాఫీ హోటల్లో ప్రవేశించాడంటే దానికేదో కారణం లేకపోలేదు. ఎదురుగా నర్సయ్య వస్తున్నాడు!

నర్సయ్యకు తను ఆరు వేలు యివ్వాలి. సుబ్బయ్యశెట్టికిలాగే నర్సయ్యకు కూడా మంచీ మర్యాదా తెలియవు. తనవంటి పెద్ద మనిషినిఎలా గౌరవించాలో వాళ్లకు తెలియదు. పైగా - అప్పులు చేసేవాడూ ఓ పెద్దమనిషేనా అని నవ్వేస్తాడు.

వాళ్లకేం తెలుసు. అసలు పెద్ద మనుషులే ఈ రోజుల్లో అప్పులు చేస్తారని!

తనిప్పుడు కాఫీ హోటల్లోకి ఎందుకు ప్రవేశించాడు? నర్సయ్యకు భయపడా? కాదు.. తానొక నిశ్చయానికి వచ్చాడు. ఈ ఋణాల నుంచి విముక్తి చెందడానికి తనకొక ఉపాయం తోచింది. అందుకే యిప్పుడు హోటల్లో ప్రవేశించాడు.

వెనకటికి..కంసుడికి చివరి దశలో ఎక్కడ చూసినా కృష్ణులే కన్పించారట. కానీ.. అది కేవలం కంసుడి భ్రమ మాత్రమే!

అయితే.. రమణయ్య ఏ మాత్రమూ భ్రమపడే వ్యక్తి కాదు. అతను కూర్చున్న సీటుకు అల్లంత దూరంలో ప్రకాశరావు కూర్చుని ఉన్న మాట అక్షరాలా నిజం. ప్రకాశరావును

అదృష్టవశాత్తూ ప్రకాశరావు రమణయ్యను చూడడంలేదు. అయినా తను మాటాడితే గొంతు గుర్తుపట్టి వచ్చేస్తాడేమోనని రమణయ్య భయం. అప్పులిచ్చినవాళ్లకు చెవుడుండ కూడదూ అని రమణయ్య ఎన్నోసార్లనుకున్నాడు. కానీ, దురదృష్టవశాత్తూ అతనికి అప్పిచ్చిన ఏ ఒక్కరికీ చెవుడు లేదు. అందులో ప్రకాశరావు చెవులు మరీ గట్టివి.

భగవంతుడు ఆపద్బాంధవుడు. రమణయ్య తనను తలుచు కోకపోయినా... అతనికష్టాన్ని చూడలేక సర్వరులో ప్రవేశించినట్లున్నాడు. సర్వరు తనంతట తనే "యిడ్లీ తెచ్చేదా?" అని అడిగాడు. అవకాశం కోసంఎదురుచూస్తున్న రమణయ్య వెంటనే తల ఊపాడు. ఆ సమస్య అలా తీరిపోయింది.

ప్రకాశరావు రమణయ్యను చూడకుండానే లేచి కౌంటర్ దగ్గరకు వెళ్లాడు. తర్వాత హోటల్లోంచి నిష్క్రమించాడు.

రమణయ్యకిప్పుడు స్వేచ్ఛ వచ్చింది. 'అమ్మయ్య!' అనుకుని తేలిగ్గా నిట్టూర్చాడు. ఒకసారి హుందాగా నాలుగు వైపులా చూశాడు. అంతా టిఫిన్ తినడంలో నిమగ్నులైపోయి ఉన్నారు. కొంతమంది బాతాఖానీ కొడుతున్నప్పటికీ అది వాళ్ల ఆరగింపుకాట్టే అడ్డం రావడం లేదు.

రమణయ్య కూడా టిఫిన్ తీసుకోవడం ప్రారంభించాడు.

"ఈ వేళ స్పెషల్ స్వీట్ ఏమిటి?"

సర్వరు చెప్పాడు. రమణయ్య తీసుకురమ్మన్నాడు.

టీ మాత్రమే తీసుకుని బిల్లు అడిగిన ఓ కూలీ రమణయ్య కేసి అసూయగా చూసి బిల్లు తీసుకుని వెళ్లిపోయాడు.

సర్వర్ బిల్లు ఇస్తూంటే రమణయ్యకు గుర్తుకు వచ్చింది. తనింకా ఋణవిముక్తుడు కాలేదు. రేపటి దాకా ఆగాలి!

ఏమో! తను అనుకొన్నట్లుగా చెయ్యగలడా? తనలో అంత ధైర్యం ఉందా? రమణయ్య ఓసారి నవ్వుకుని, 'నాకు ధైర్యం లేకపోవడమేమిటి? ఎంత ధైర్యం లేకపోతే ఇన్ని అప్పులు చేసి యిలా తిరుగుతున్నాను' అనుకున్నాడు.

బిల్లు చెల్లించి బయటపడబోతూంటే కాలయముడే ఎదురయ్యాడు. అంతవరకూ బయట ఎవరితోనో మాట్లాడుతూ నిలబడిపోయిన నర్సయ్య అప్పుడే హోటల్లో అడుగెట్టబోతూ రమణయ్యను చూసి ఆగాడు.

"అమ్మయ్య! ఇన్నాళ్కనిపించావా? నీతో మాటాడాలి..ఇలారా!" అన్నాడు. తన్నెక్కడ చూస్తాడో అని చూసేదాకా భయపడ్డాడు గానీ చూడగానే రమణయ్య భయాన్ని వదిలేశాడు. పైగా నర్సయ్య మీద జాలి కూడా పడ్డాడు. దురదృష్టవంతుడు, టిఫిన్ తినే యోగ్యతలేదని.

ఇద్దరూ అలా సందుపక్కకు వెళ్లారు. నర్సయ్య వాగ్ధోరణి మారిపోయింది. "ఏమయ్యా, ఇదేనా పెద్దమనిషి తరహా అంటే? నెల్లాళ్లకి యిస్తానని తీసుకెళ్ళావ్! రెండేళ్లు దాటింది. వడ్డీ మాట దేవుడెరుగు, అసలిస్తే చాలంటే అదీ యివ్వవ్!"

రమణయ్య తనలో తాను నవ్వుకున్నాడు. తనవంటివారే అదృష్టవంతులు.

ఇంచుమించు అప్పులవాళ్లంతా కూడా వడ్డీ అక్కర్లేదన్నారు. తను చేసిన అప్పుకు వడ్డీ కూడా తక్కువేమీ కాదు.

"నిన్నేనయ్యా! పైగా మనిషివి కనిపించడం కూడా మానేశావ్.. మొన్న మా మనవణ్ణి పంపిస్తే.. ఇంట్లో ఉండికూడా లేననిపించావుట!"

రమణయ్య మరోసారి నవ్వుకున్నాడు. నర్సయ్యకేమాత్రం తెలియదూ! అప్పులెక్కువగా ఉన్నవాడు ఇంట్లో ఉండి లేడనిపించడంలో తప్పేముంది? పైగా అది సహజం కూడాను.

"ఏంటయ్యా ... ఉలకవు పలకవు.. నా బాకీ ఎప్పుడు తీరుస్తావంటున్నాను. లేకపోతే ఆ యిల్లూ..."

"ఆగు, నర్సయ్యా.. నువ్వూ పిల్లలుగలవాడివి. నీకు తెలియందేముంది?" రమణయ్య యిలా మాట్లాడ్డం నర్సయ్యకేమీ కొత్త కాదు.

"ఇదిగో,పంతులూ!నాక్కావలసింది సమాధానం కాదు. డబ్బు. ఆరు వేల రూపాయలు."

"ఎందుకలా గొంతు చించుకుంటావ్ నర్సయ్యా? .. నాకామాత్రం తెలియదనుకున్నావా? నేను మాత్రం మంచీ మర్యాదా లేనివాడినా? పరువైన కుటుంబంలోనే పుట్టాను. సమయానికి కాలం కలసిరాక ఇబ్బందిపడుతున్నానంతే. తెల్లారేసరికి నీ బాకీ పైసలు చేయకపోతే నా పేరు రమణయ్యే కాదు."

"ఏమిటీ.. రేపిస్తావంటావా?"

"ఆ.. రేపటి దాకా ఆగు. ఇంక మళ్లీ నీచేత అడిగించుకోను. నా మాట మీద నమ్మకం ఉంటే..."

"నీ మాట మీద నమ్మకం ఏనాడో పోయింది లేవయ్యా. ఐనా రేపటిదాకా చూస్తాను. పోయిందేముంది! రేపు దాటిందంటే ఇల్లు వేలం.."

"నాకామాత్రం తెలియదూ?" తెచ్చిపెట్టుకుని నవ్వాడు రమణయ్య. అసంతృప్తిగా వెళ్లిపోయాడు నర్సయ్య. రేపు!

రేపు చాలా గొప్పది. ఈ రేపుతోనే తనెన్నోసార్లు రక్షించబడ్డాడు. దేవుడు తనకోసమే ఈ రేపును సృష్టించి ఉంటాడు. కానీ, రేపు రాబోయే 'రేపు' చాలా గొప్పది. నిజంగానే తనకు ఋణవిముక్తుణ్ణి చేస్తుంది. ఇంక ఎవరూ తనను నిలదీయలేరు.

నర్సయ్య వెళ్లిపోయినా రమణయ్య మరికొంచెంసేపు సందులో ఉండిపోయాడు. తన ఊరివాళ్లంతా రోజూ రాజమండ్రీ వస్తూ పోతూనే ఉంటారు. మెయిన్ రోడ్ మీదికి వెళ్లడం తనకాట్టే మంచిపని కాదు.. పరువు కోసం ప్రాకులాడేవాడు కదా!

తన జేబులో ఇప్పుడు నాలుగు వందలున్నాయి. నిన్ననే వెంకయ్య దగ్గర తీసుకున్నాడు .. ఎల్లుండి ఇచ్చేస్తానని చెప్పి. ఇప్పుడీ సొమ్ముతో తన భార్య తాలూకు రెండు నగలు తాకట్టు విడిపించాలి. తన జేబులో నాలుగు వందలుందని తెలియడం చాలా ప్రమాదం. జేబుదొంగ అంటే తనకెప్పుడూ భయంలేదు. ఎటొచ్చీ...

గోవిందరావుకు తను సరిగ్గా నాలుగు వందలే యివ్వాలి. ఇవి అతని కళ్లబడ్డాయంటే ఇక వదిలిపెట్టడు. గోవిందరావుకీ ఊళ్ళో ఓ ఫాన్సీ షాప్ కూడా ఉంది. అది సరిగ్గా తనిప్పుడు వెళ్లవలసిన మార్వాడీ కొట్టు ప్రక్కనే ఉంది.

అయినా ఫరవాలేదు! తను గోవిందరావుకు మస్కా యివ్వగలడు.

రమణయ్య సందులోంచి బయటకు వచ్చి చిన్నగా మెయిన్ రోడ్ మీద నడక ప్రారంభించాడు.

తను అదృష్టవంతుడే! గోవిందరావు షాప్‌లో లేడు. భగవంతుణ్ణి మెచ్చుకుంటూ రమణయ్య మార్వాడీ కొట్టులో అడుగుపెట్టి తెల్ల మొహం వేశాడు.

లోపల మార్వాడీతో గోవిందరావు మాట్లాడుతున్నాడు.

రమణయ్యను చూడ్డంతోనే గోవిందరావు ముఖం విప్పారింది. మాట్లాడడం ఆపి జేబులోంచి ఓ కాగితం తీసి రమణయ్యకు చూపించాడు.

ఆ కాగితం ఏమిటో రమణయ్య ముందే ఊహించగలడు. అది 250 రూపాయలకు అర్.ఆర్. కాగితం. "చూడండీ, రమణయ్యగారూ! రెండు వందల యాభైరూపాయలు మీకు పెద్ద ఎక్కువేం కాదు. నాలుగొందలూ ఇప్పుడివ్వక్కర్లేదు. ప్రస్తుతం ఈ అర్.ఆర్. విడిపించడానికి డబ్బిస్తే.. కావాలంటే మీకు మళ్లీ యిస్తాను. రేపు విడిపించకపోతే డెమరేజ్ తగులుకుంటుంది. నా దగ్గర చూస్తే లెక్క లేదు. ఏం చేయాలో ఆలోచిస్తూంటే సమయానికి మీరు ఆపద్భాంధవుడిలా కన్పించారు."

అప్పు వసూలు చేసుకోవడానికి కూడా సామదానభేద దండోపాయాలుపయోగించాలని వ్యాపారంలోకి దిగగానే గోవిందరావు తెలుసుకున్నాడు. అయితే గోవిందరావుకు రమణయ్య నడగడం ఇది మొదటిసారి కాదు. ఈ నాలుగూ రమణయ్య మీద ప్రయోగించడం అయిపోవడంతో, మళ్ళీ మొదటికొచ్చాడు.

రమణయ్య గోవిందరావు మీద జాలిపడ్డాడు.

"అవునబ్బాయ్.. నాకు నీ సంగతి తెలియదూ? నువ్వునన్నడుగుతున్నావంటే ఎంతో అవసరమైతేగానీ అడగవని నాకు తెలుసు. కానీ ఏం లాభం? ప్రస్తుతం నా దగ్గర ఏమీలేదు. రేపటి దాకా ఆగు. నీ బాకీ ఇంక అడక్కుండా చేస్తాను. పైగా అర్.ఆర్. విడిపించుకుందుక్కూడా రేపటి దాకా టయిముందిగదా? ఎలాగో రేపటి దాకా ఆగుమరి." తను అప్పివ్వబోతున్నట్లు మాట్లాడాడు రమణయ్య.

ఇంతలో రమణయ్యకు మరో అనుమానం వచ్చింది. తనిప్పుడు మార్వాడీ కోసం వచ్చేదని తెలిస్తే గోవిందరావు కనుమానం కలగవచ్చు. అందుచేత ముందా అనుమానాన్ని తొలగించాలి. "ఈ విషయం చెబుదామనే నీ షాపుకొచ్చాను. పక్కనున్నావంటే యిలా వచ్చాను."

రమణయ్య చిన్నగా నవ్వేడు. అలా నవ్వడం అతనికలవాటైపోయింది. ఇక నీ ప్రమేయం లేదన్నట్లు గోవిందరావు మళ్లీ మార్వాడీతో సంభాషణ ప్రారవంభించాడు. "భైరో, సాబ్!" అని మార్వాడీ అన్నప్పటికీ కూర్చోకుండా బయటి కొచ్చేశాడు రమణయ్య.

గోవిందరావెంత సేపుంటాడో ఏమో?

వడ్డీ పెరుగుతూందని ఆశ కాబోలు.. మార్వాడీ ఎప్పుడూ తాకట్టు మాటైనా గుర్తు చెయ్యడు. అదీ ఒకందుకు మంచిదే అనుకున్నాడు రమణయ్య. గోవిందరావు బయటికి వచ్చేదాకా తను లోపలికి వెళ్లడానికి వీల్లేదు. ఈలోగా రమణయ్యకోసారి ముకుందయ్యను చూడాలనిపించింది. ముకుందయ్యకు అక్కడికి ఫర్లాంగు దూరంలో ఓ బట్టల షాపు ఉంది. ముకుందయ్యది కూడా పేరవరమే.

తన ఊరివాడేకదా అనీ,మంచివాడనే నమ్మకంతోటీ ముకుందయ్య నాలుగేళ్ళ క్రితం రమణయ్యకు బట్టలు అరువిచ్చాడు. తక్కువ మొత్తమేం కాదు. పెళ్ళి బట్టలు. రమణయ్య రెండో కూతురు పెళ్ళికి.

ముకుందయ్య చాలా మంచివాడు, ముఖ్యంగా రమణయ్య దృష్టిలో. అతనెప్పుడూ రమణయ్యను నిలదీసి అడగలేదు. 'అయినా నాలుగేళ్ళేగా అయింది?' అనుకుంటూంటాడు రమణయ్య.

తమ పెద్ద కూతురు పెళ్ళికి చేసిన అప్పులే ఇంకా తీర్చలేదు. ఇక చిన్న కూతురు పెళ్ళికి చేసిన వాటిమాట ఇప్పుడప్పుడే ఆలోచించవలసిన అవసరం ఏముంది?

క్రమంగా ఉండడం అంటే రమణయ్యకు చాలా యిష్టం. అప్పులు తీర్చడానికి కూడా ఓ క్రమం అంటూ ఉంది. ముందెవరి దగ్గర తీసుకున్నాడో వాళ్ళకు తీర్చాలి. తీరిస్తే ముందు పెద్ద కూతురు పెళ్ళికాలంనాటి అప్పులే తీర్చాలి!

రమణయ్య ఓసారి తన్ను తానే తిట్టుకున్నాడు. ఇప్పుడు తను అప్పులు తీర్చడం గురించి ఆలోచిస్తున్నాడు. అది తనవంటి వాళ్ళు ఆలోచించవలసిన విషయం కాదు. పైగా తనో నిశ్చయానికొచ్చేశాడు కూడా! ఎంత పొరపాటు చేశాను అనుకున్నాడు.

ముకుందయ్య షాపు వచ్చింది. రమణయ్య లోపలికి అడుగు పెట్టాడు. జనం ఎక్కువగా లేరు. ముకుందయ్య ఖాళీగానే ఉన్నాడు. రమణయ్యను చూడ్డంతోనే అతని ముఖం వికసించింది. ఈ మధ్య రమణయ్య తనను తప్పించుకు తిరుగుతున్నాడు. అటువంటిదీవేళ పనిగట్టుకుని తన షాపుకు వచ్చేడంటే.. తప్పకుండా బాకీ చెల్లించడానికే వచ్చి ఉంటాడు. ఇలా ఊహించే "రండి, రండి" అంటూ మర్యాద చేశాడు ముకుందయ్య.

రమణయ్య బల్ల మీద కూర్చుని 'అసలు ముకుందయ్య దారేవేరు' అనుకున్నాడు.

"ఈ మధ్య బొత్తిగా కనిపించడం మానేశారు" ముకుందయ్యే పలకరించాడు.

"ఆం! ఏముందిలే, ముకుందయ్యా..ఎప్పటికప్పుడే వద్దామనుకోడం..ఐనా ఈ మధ్య నాల్రోజులబట్టి ఇంటికి రావడం లేదుటగా?"

"ఏదండీ,పంతులుగారూ? ఎక్కడా తీరుబడి లేదు.డబ్బు సమయానికి చేతిలో ఉండక చాలా ఇబ్బంది పడుతున్నాను. ఎక్కడోక్కడ అప్పు చేద్దామని ప్రయత్నిస్తున్నాను. మనూళ్ళో అప్పిచ్చేనాథుడెవరు చెప్పండి? అందుకని ఇక్కడే..."

"ఓహో! అర్థమయిందిలే...అయినా అడగాలేగాని నీకివ్వనివాడెవడులే..."

"అలా అనకండి. ఈ రోజుల్లో అప్పుపుట్టడం కష్టంగానే ఉంటోంది. నాలుగు

రోజులబట్టి ప్రయత్నిస్తున్నానన్నమాటేగానీ.. ఇంతవరకూ ఫలితం శూన్యం. అర్జెంటుగా మూడు వేలు కావాలి. ఏం చేయాలో పాలుపోవడం లేదు.''

''అంతేలే ముకుందయ్యా! ఒక్కొక్కప్పుడు అలాగే వస్తూంటుంది. వ్యాపారమన్నాక అన్నీ అనుభవించాలి మరి.'' రమణయ్య ముకుందయ్యను ఓదార్చాడు.

ముకుందయ్యక్కావలసింది ఓదార్పు కాదు. డబ్బు! వాటం చూస్తే రమణయ్య బాకీ తీర్చడానికి వచ్చినట్లు లేదు. ముకుందయ్యకు కొంచెం కోపమే వచ్చింది.

''పోనీ.. మీరేదైనా కొంత సర్దుబాటు చేయ్యగలరా?''

రమణయ్య మొహమాటం లేకుండా గట్టిగా నవ్వేశాడు. ''భలేవాడివిలే, ముకుందయ్యా, నేనా విషయం చెప్పడానికేవచ్చాను. రేపు మా యింటికిరా.. అంతే! ఇక ఎల్లుండి నుంచి నువ్వు నన్ను బాకీ అడగవు. అర్థమైందా?''

ముకుందయ్యకీ లౌక్యం మాటలు అర్థం కాలేదు. ''అంటే?''

''అంటేనా? నువ్విన్నాళ్ళూ ఎలాగో అలా ఆగావు. ఇంకొక్కరోజు అంటే రేపటి దాకా ఆగమంటున్నాను.''.

రమణయ్య కంఠంలో దృఢ నిశ్చయం ధ్వనించింది. ముకుందయ్య ముఖం ఆనందంతో విప్పారింది. ''ఒక్క రోజుకేమిటిలెండి, పంతులుగారూ! అలాగే ఆగుతాను కానీ..''

''మరింకేమీ సందేహం అవసరం లేదు. అయినా నీదారే వేరులే, ముకుందయ్యా! నీలాంటి మనిషిని నేనింతవరకూ ఎక్కడా చూడలేదు'' అన్నాడు రమణయ్య.

ఎవరో షాపులో అడుగుపెట్టారు.'ఇక వస్తాను, ముకుందయ్యా! బేరాలు చూసుకో!' అనేసి రమణయ్య రోడ్డు మీద పడ్డాడు. పక్క షాపులోంచి ఓ గడియారం గంటలు కొడుతోంది. రమణయ్య ఆగి గంటలు విన్నాడు. నాలుగయింది. అంటే ఈరోజు పూర్తికావడానికి యింకా ఎనిమిది గంటలుంది. అప్పుడు రేపు వస్తుంది. తను ఋణవిముక్తుడవుతాడు. ఎలా?

తను చేయబోయేది మంచిపని కాదేమో? అంతా తనను తిట్టుకుంటారేమో? రేపటితో బాకీ ఫైసలవుతుందనడంలో అర్థం యిదా.. ఎంత మోసగాడు! అంటారేమో? ఎవరేమనుకుంటే తనకేం? తను ఋణవిముక్తుడవుతాడు. అదే తనక్కావలసింది.

గోవిందరావు వెళ్ళిపోయినట్లున్నాడు. షాపులో మార్వాడీ ఒక్కడే ఉన్నాడు. రమణయ్య లోపలికి ప్రవేశించాడు. త్వరత్వరగా మార్వాడీ చేత లెక్కలు కట్టించాడు. 372 రూపాయల 74 నయాపైసలు చెల్లించి భార్య తాలూకు రెండు నగలూ విడిపించాడు. అవి జేబులో వేసుకోగానే అతని హృదయం ఆనందంతో నిండిపోయింది.

తన భార్య మెడలోంచి ఈ నగలు విడదీయబడి ఆరేళ్ళవుతుందేమో? ఒకచోట తాకట్టు పెట్టడం..విడిపించడం..మళ్ళీ మరోచోట!

తాయారు మహాసాధ్వి. ఎప్పుడూ పల్లెత్తు మాటైనా అనలేదు. ఎన్ని కష్టాలు వచ్చినా చిరునవ్వు మానదు. ఆ చిరునవ్వే తనకు ధైర్యమిస్తూంటుంది. కానీ.. ఈవేళ.....ఛా!

చిరునవ్వు తనకు ధైర్యమివ్వడమేమిటి? ఆ చిరునవ్వుతో తను ఏం సాధించగలడు? అందుకే తను ఈ నిశ్చయానికి వచ్చాడు.

బజార్లో పడ్డాడు మళ్ళీ. నడుచుకుంటూ కూరగాయల మార్కెట్‌కు వచ్చాడు. నవనవలాడే వంకాయలతన్ని ఆకర్షించాయి.

వంకాయకూర చాలా రుచిగా ఉంటుంది. కావాలనుకున్నా మళ్ళీ ఇలాంటి వంకాయలు దొరకవు. రమణయ్య వీశెడు వంకాయలు కొని పై మీది తువ్వాలులో వేసి మూటగట్టుకున్నాడు.

ఇంక తను తిరుగుదారి పట్టవచ్చు.

బస్‌స్టాండుకు వెళ్ళేదారిలో రామచిలుకల జోస్యాన్ని చూసి ఆగిపోయాడు. తనూ తన భవిష్యత్ చూసుకుంటే!

తన భవిష్యత్ తనెలాగూ నిర్ణయించేసుకున్నాడు. దానికింకా జోస్యం చూడ్డంకూడా ఎందుకూ? ఐనా ఎందుకో చూడాలనిపించింది. వెళ్ళి మూడు నయాపైసలు అక్కడ కూర్చున్న ముసిలాయన చేతిలో పెట్టాడు. ముసిలాయన హుందాగా నవ్వి పంజరం తలుపు కొంచెం పైకి తీశాడు.

రామచిలుక వచ్చి అక్కడ పేర్చి ఉన్న నలభై కాగితాల్లో ఓ కాగితాన్ని తీసింది. ప్రపంచంలో ఉన్న ఇన్ని కోట్ల జనుల భవిష్యత్తూ నలభై భాగాలుగా విభజించబడింది. ఎవడి భవిష్యత్ కావాలన్నా ఇక్కడి ఈ నలభై కాగితాల్లోంచే ఓ కాగితాన్ని తీస్తుంది చిలుక.

"మీ యింటిని ఏలినాటి శని పట్టుకు పీడిస్తున్నాడు. రేపటితో ఆ శని వదిలిపోతుంది. మునుముందు చాలా సుఖపడతావు...." సరదాగా తీసినా జోస్యంలో నిజం కనిపించడం రమణయ్యకు ఆశ్చర్యాన్నే కలిగించింది. తన యింటిని పట్టుకున్న ఏలినాటి శని ఎవరో తనకు తెలుసు. ఆ శనిని తను రేపు హత్య చేయబోతున్నాడు. జ్యోతిష్యాన్ని కొట్టి పారేయకూడదని రమణయ్య గ్రహించాడు.

బస్‌స్టాండ్ దగ్గర సుబ్బయ్య శెట్టి ఉన్నాడు. రమణయ్య అతన్ని చూసినప్పటికీ తప్పించుకోవడానికే ప్రయత్నమూ చెయ్యలేదు. "ఏమయ్యోయ్, పంతులూ!" చూడకుండా వెళ్ళిపోతాడేమోననే భయం కొద్దీ సుబ్బయ్యశెట్టి పిలిచాడు.

సుబ్బయ్యశెట్టి పిలుపులో గౌరవం ఏ మాత్రం లేదు. తనెవరూ గౌరవించడం లేదని బాధపడడం నాలుగేళ్ళుగా మరిచిపోయాడు - ఒకప్పుడు "ఒహో" అనిపించుకున్న రమణయ్య.

"కనిపించడమే మానేశావ్?" అన్నాడు సుబ్బయ్యశెట్టి.

"నేను మీక్కనిపించకపోవడమా? ఐనా మాలాంటి వాళ్ళం మీకు కనిపించినా కనిపిస్తామా?" రమణయ్య చెణుకు విసిరాడు.

సుబ్బయ్య శెట్టి గాబరా పడ్డాడు. "అదేంటయ్యోయ్... అలాగంటున్నావు...నీకోసం తపించిపోతూంటే!?

"నాకోసమా?" రమణయ్య అనవసరంగా ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

"రేపు నీ యిల్లు వేలం వేస్తున్నాం."

శెట్టిది బొంగురు గొంతుకు అయినందుకు రమణయ్య చాలా సంతోషించాడు. శెట్టి మాట్లాడుతుంటే ఎంతో అనుభవం ఉన్నవాడుగానీ అర్థం చేసుకోలేదు. అందుచేత చుట్టూ ఉన్నవాళ్ళ దగ్గర తన పరువు నిలబడింది.

"అలాగా...చాలా సంతోషం"అన్నాడు రమణయ్య వెటకారంగా.

"అంటే?" శెట్టి ప్రశ్నార్థకంగా చూశాడు.

"అయ్యో...సుబ్బయ్యా నువ్వింత వెర్రివాడవేంటయ్యా! ఆ యిల్లూ, రెండెకరాలపొలం అన్నీ నా భార్య పేరునే ఉన్నాయని అప్పిచ్చినప్పుడే నీకు తెలుసుగా?"

"అయితే మాత్రం? నీవడ్డు పెట్టవని నాకు తెలుసుగా?"

"కాలానుగుణంగా మనుషులు మారిపోతే...."

శెట్టి గర్జించాడు.

"జైలు కెళ్తావు. తెలుసుగా డిక్రీ అయిందని?"

"శెట్టీ! నువ్వు చాలా వెర్రివాడవయ్యా.. నే జైలు కెళ్తే నీక్కలిసొచ్చేదేముంది? ఐనా నీ బాకీ నేను రేపటితో ఫైసలు చేద్దామనుకుంటూంటే" అని ఆగి పెదవి చప్పరించి, "ప్చ్.. నీకిష్టం లేదు...సరేలే.. నీయిష్టం వచ్చినట్లే కానీ" అన్నాడు రమణయ్య.

నల్లగా ఉన్న మూలాన కనిపించలేదు కానీ సుబ్బయ్య ముఖంలో రంగులు మారాయి. ఆ ముఖంలో నయాపైసంత ఆనందం కూడా కన్పించింది."ఇస్తానంటే ఎందుకు పుచ్చుకోమూ.. నువ్వు మరీ విడ్డూరంగా మాట్లాడుతావ్, ఐనా ఉన్నపళంగా రేపట్లోగా బాకీ ఎలా తీరుస్తా వయ్యా?"

"ఎలా తీరుస్తే నీకెందుకూ? ఎల్లుండి...ఏం రమణయ్యా, నా బాకీ మాటేమిటి అని నీచేత అనిపించుకునే పరిస్థితిలో ఉండను. తెలిసిందా?" అన్నాడు రమణయ్య.

"అదీ చూద్దాం..." అన్నాడు శెట్టి.

బస్ వచ్చేసింది. రమణయ్య త్వరగా వెళ్ళి బస్ఎక్కాడు. జనం బస్ మీదికి ఎగబడ్డారు. బొజ్జ పెద్దది కావడంచేత శెట్టి బస్ ఎక్కలేకపోయాడు. బస్ కదులుతూంటే ఎక్కణించో పరుగెత్తుకు వచ్చాడు ప్రకాశరావు. "ఖాళీ లేదు" అన్నాడు కండక్టర్. బస్ కదిలి పోయింది.

అప్పుడే కదలబోతూన్న ఆటో రిక్షా ఎక్కాడు ప్రకాశరావు. శెట్టికి అందులోనూ ఖాళీ దొరకలేదు.

ధవళేశ్వరం ఆనకట్ట దగ్గర దిగి రమణయ్య మెల్లిగా కాలిదారి పట్టాడు. అక్కడి నుంచి రెండు ఆనకట్టలు. దాటితే బొబ్బర్లంక వస్తుంది. అక్కణ్ణించి పేరవరానికి మరో రెండు మైళ్ళు నడవాలి.

రమణయ్యకు చెవుడు లేదు. ఐనా అత్యవసర పరిస్థితుల్లో మనిషి అన్ని అలవాట్లూ చేసుకోవాలిట. రమణయ్య కూడా మనిషే. లేకపోతే అతని వెనకాల నుంచి పరుగెత్తుకుంటూ తనను పిలుస్తున్న ప్రకాశరావు పిలుపు వినిపించి ఉండకపోదు.

ప్రకాశరావు కేకలు ఆనకట్టంతా నిండిపోయి అందర్నీ స్తబ్ధుల్ని చేయడంతో...రమణయ్య ప్రక్కగా నడుస్తూన్న ఒక వ్యక్తి ....ఏమీ చలించకుండా పయనిస్తున్న రమణయ్యను...చూసి ఆశ్చర్యపోయి..“నిన్నేనయ్యా...వెనకాల ఎవరో పిలుస్తున్నారు?” అన్నాడు.

ఇంతసేపూ తనీలోకంలో లేనట్లూ, ఇప్పుడే ఈ లోకానికి వచ్చినట్లూ చుట్టూ ఒకసారి పరిసరాలను పరీక్షించి వెనక్కు తిరిగి చూసి ఆగాడు రమణయ్య. ప్రకాశరావు కనిపించగానే ‘పోనీలే.. దారిపొడుగునా కాలక్షేపం. ఎంత లేదన్నా ఎరిగున్నవాడు’ అనుకున్నాడు.

రమణయ్య చూసే సమయానికి హడావుడిగా పరుగెత్తుకువస్తున్న ప్రకాశరావు హడావుడిలో నాచు మీద కాలేసి జారి క్రిందపడి లేవడానికి ఒక దయాశీలి చేయూత తీసుకుంటున్నాడు.

రమణయ్యకు ప్రకాశరావు మీద జాలేసింది. ఎందుకంత హడావుడి? తనీవేళ అతనెంత మొత్తుకున్నా అప్పు ఎలాగూ తీర్చడు,తీర్చలేడు! ఈ అప్పులిచ్చిన వాళ్ళకు మతి స్థిరంగా ఉండదేమో...లేకపోతే అది ప్రకాశరావు అమాయకత్వమేనా అయి ఉంటుంది.

అది అమాయకత్వమే! అతను అమాయకుడు కాబట్టే తనకు ఐదు వేలు అప్పిచ్చాడు. రమణయ్య ఈ విషయాన్ని గ్రహించేసరికి ప్రకాశరావు అతన్ని సమీపించాడు.“ఏంటోయ్, ప్రకాశరావు...అలా ఆనకట్ట మీద పరుగెడితే జారిపడవూ...ఆ మాత్రం తెలియదా?” అది మందలింపు.

“బాగానే ఉంది. పిలుస్తే ఆగరాయిరి, మరి?”

“ఏమిటంత హడావుడి!”

“హడావుడి అని నెమ్మదిగా అంటారేమిటండీ? అడుగుదామంటే కన్పించనే కన్పించరు. ఒకటా... రెండా... అయిదు వేలు. మీ వాటం చూస్తుంటే ఇచ్చేలా కనిపించడం లేదు.” జారి పడడం వల్ల దెబ్బలు తగిలాయేమో, ప్రకాశరావు కోపంగా ఉన్నాడు.

“చాల్లేవోయ్...పెద్దవాళ్ళతో ఎలా మాట్లాడాలో తెలియదు. ఎన్నాళ్ళయిందేమిటి? నాలుగేళ్ళేగా ! ఐదు వేలు. అంతేగదా! సుబ్బయ్య శెట్టి దగ్గిర పదివేలు తీసుకున్నాను. కానీ అతనెప్పుడూ యిలా మాటాడలేదు.’

“సరే..ఎవరెలా మాటాడారో చెబుతున్నారు గానీ... మీరు బాకీ యిస్తానని మాత్రం చెప్పడం లేదు.”

“నీచేత అస్తమానూ అడిగించుకోవడం నాకు మాత్రం సరదా అనుకున్నావేమిటి? రేపటితో ఈ బాకీ అంతు తేల్చేద్దామనుకుంటున్నాను. అనవసరంగా మాట జారేసేవు గానీ”

ప్రకాశరావు నాలిక్కొరుక్కున్నాడు.“అవునండీ.. చాలా కాలమైపోయిందా... లెక్క అవసరంతో ఎంతో యిబ్బందిగా ఉంది. సమయానికివ్వవలసిన వాళ్లేనా ఇప్పుడివ్వడంలేదే అని బాధపడుతున్నాను. ఇంతకీ మీరు రేపిచ్చేస్తానంటున్నారు?”

“చెప్పానుగా... నా మాటకు తిరుగుండదు. అంతే!”

ఏ టైములో ఎలా మాట్లాడాలో రమణయ్యకు తెలుసు. దారిలో ప్రకాశరావింక మళ్ళీ మాట్లాడలేదు. రమణయ్య ఇల్లు చేరుకున్నాడు.

భార్య వచ్చి తలుపు తీస్తూంటే రమణయ్య కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. నిజంగా తాయారు చాలా బాగుంటుంది. అందానికి తగ్గ గుణం.. అటువంటి తాయారును... తను చేయబోయే పని ఊహించుకుని కలవరపడి పోయాడు రమణయ్య.

లోపల అడుగెట్టగానే మళ్ళీ వీధి తలుపు గడియవేసి "తాయారూ!" అన్నాడు. వెళ్ళిపోబోతున్న ఆమె వెనక్కు తిరిగింది"ఏం తెచ్చానో తెలుసా?" అన్నాడు మూట దింపుతూ.

"వంకాయలు!" అందావిడ తడుముకోకుండా.

"ఛా...అవికావు. ఇంకేమిటో చెప్పుకో!"

"బంగాళా దుంపలయ్యుంటాయి" అందావిడ ఆలోచిస్తూ.

"అబ్బ! అవి వంకాయలేలే..అవికాదు. ఇంకా ఏవో తెచ్చాను. ఏమిటో చెప్పుకో!"

తాయారు కొంచెంసేపు మౌనం వహించి "ఏమో నాకు తెలీదండీ!" అంది.

"అమ్మేదీ?"

"శంకరమ్మ గారింటికెళ్ళారు."

"బాచిగాడు?"

"ఆడుకోడానికి వెళ్ళి యింకా రాలేదు."

రమణయ్య జేబులోంచి నగలు తీసి "ఇలారా!" అన్నాడు. ఆవిడ ఆశ్చర్యపోతూ అతని దగ్గరికి వచ్చింది."ఇవి పెట్టుకో!"

"ఎలా తెచ్చారండీ యివి!"

రమణయ్య బాధగా నవ్వాడు.'రేపటితో నేను ఋణ విముక్తుణ్ణవుతాను. తాయారూ! ఆ సంతోష సందర్భంలోనే ఇవి తెచ్చాను. నువ్వింకేమీ భయపడక్కరలేదు. ఇవి పెట్టుకో. వీటితో నిన్ను చూడాలనుంది."

వయస్సుకూ, సిగ్గుకూ సంబంధంలేదు. సిగ్గు స్త్రీ జాతికి ఆభరణం. భర్త అలా మాటాడుతుంటే, ఆవిడ ముందు సిగ్గు పడింది. తరువాత నగలు ధరించింది."అబ్బ...ఎన్నాళ్ళకి నిన్నీవిధంగా చూశాను! ఇప్పుడు సాక్షాత్ లక్ష్మీదేవిలా ఉన్నావు." ఏదో మాట్లాడుతున్నాడేగానీ, అతనికీ మాటలు సరిగా రావడం లేదు.

తను తాయారుకు తీరని అన్యాయం చేస్తున్నాడేమో? తను చెయ్యబోయే పనివల్ల తాయారుకు కలగబోయే బాధ...తనా విషయం ఆలోచించకూడదు. ఆ బాధ తను ఊహించలేడు. కానీ, తను ఋణ విముక్తుడు కావడానికి అంతకుమించి మరో ఉపాయం లేదు. తనాపని చెయ్యక తప్పదు.

"నాకీవేళ వంకాయకూర తినాలని ఉంది. బాగా చెయ్యాలి." తాయారు వంటింట్లోకి వెళ్ళిపోయింది. ఇంతలో వీధి తలుపు ఎవరో తట్టారు. సందేహిస్తూనే తలుపు తీశాడు.

కొడుకు వచ్చాడు. రమణయ్యకు కొడుకు రోజూకంటే ముద్దుగా కనిపించాడు."ఒరేయ్,

యిలారా!". వాడు వచ్చాడు "ఇంద...ఈ రూపాయి తీసుకో. రేపు సినిమాకెళ్ళు"

అనుకోకుండా తండ్రి రూపాయి యివ్వడంతో ఆ కుర్రాడి సంతోషానికి పట్టపగ్గాలు లేవు. 'నాన్న ఎంత మంచివారు!' అనుకున్నాడు. పైకిమాత్రం "అబ్బే నాకెందుకండీ?" అన్నాడు.

"ఇస్తున్నప్పుడు తీసుకోడానికేం? తీసుకో" అన్నాడు రమణయ్య. కుర్రాడు ఆనందం పట్టలేక "అమ్మా"అంటూ లోపలికి పరుగెత్తాడు. రమణయ్య నవ్వుకున్నాడు. పిల్లలు సంతోషాన్ని ఒక్కరూ భరించలేరు. అది తల్లిక్కూడా కొంత యివ్వాలి.

పెత్తనాలు ముగించుకుని తల్లి వచ్చింది.

"అమ్మా" రమణయ్య ధైర్యం అంతకంతకూ నశించిపోతూంది. తను ఎందుకింత సాహసం చేయబోతున్నాడు? ఇందువల్ల ముగ్గురు అమాయకుల్ని కష్టాల పాల్జేసినవాడవుతాడు.

దొంగతనమూ... ధైర్యవంతుల లక్షణాలు కావు. ధైర్యవంతులెప్పుడూ ఆ పనులు చెయ్యరు. అవి పిరికివాళ్ళ లక్షణాలు.

"పోనీలే...నేను పిరికివాణ్ణి" అనుకున్నాడు రమణయ్య.

పాపం! ఆత్మకెప్పుడూ మాట్లాడ్డానికి అవకాశం ఉండదు. అందుకే యిటువంటి సమయం వచ్చినప్పుడు కరువుదీరా మాట్లాడేస్తుంది. దానివల్లే తనకిప్పుడు స్థిమితం లేకుండా పోతూంది. 'నా ఊసు ఈ ఆత్మకెందుకో'...అని తనలో తానే విసుక్కున్నాడు రమణయ్య.

పిలిచి ఆలోచనలో పడిపోయిన కొడుకు వంకే జాగ్రత్తగా చూస్తున్న జానకమ్మగారు 'అదేమిట్రా అబ్బాయ్... అలాగున్నావ్" అంది.

"ఎలాగున్నానమ్మా? చాలా సంతోషంగా ఉన్నాను. రేపటితో నాకింక అప్పుల బాధ ఉండదు. ఇన్నాళ్ళకి వీటి విషయం పరిష్కారం చెయ్యగలుగుతున్నాను. ఈ విషయం గురించే రాత్రి పనిమీద వెళ్తున్నాను. రేపు రావడం కొంచెం ఆలస్యమయినా కంగారు పడకండేం?"

"ఎలా తీరుస్తావురా ఈ అప్పులన్నీ?" జానకమ్మగారు ఆశ్చర్యంగా అడిగింది.

"అదంతా నీకెందుకు? ఇంక రేపట్నుంచి అప్పుల వాళ్ళ పోరుండదు. అంతే! నన్నేమీ అడక్కు" అన్నాడు.

"ఎలాగో అలా వాళ్ళ పోరు వదలడమే కావలసింది." అని లోపలికి వెళ్ళిపోయింది జానకమ్మగారు. అప్పులవాళ్ళ రాకపోకలూ, సూటిపోటి మాటలతో ఆ కుటుంబం వాళ్ళు బాగా విసిగిపోయారు.

రమణయ్య మొదట్లో బాగా ఉన్నవాడే! కానీ, ఆర్భాటాలకు పోయి డబ్బు పాడు చేసుకున్నాడు. నిజంగా బ్రతికిచెడ్డ వాడి జీవితం చాలా కష్టంగా ఉంటుంది. ఎంతో వైభవంగా ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్లు చేశాడు. రమణయ్యకెంతో పలుకుబడి ఉండేది. ఆ పలుకుడిమీదే అప్పు పుట్టింది. పెరిగే అప్పుతోపాటు ఆస్తీ, పలుకుబడీ కూడా క్రమంగా తగ్గిపోసాగాయి. అయినా పూర్వపు గౌరవంచేత రమణయ్యను నిలదీసి అడగలేరు. వారిలో

చాలామంది పూర్వం రమణయ్య డబ్బు ఇంతో అంతో తిన్నవాళ్ళే!

ఒకప్పుడు రమణయ్య చాలామందికి సహాయాలు చేశాడు. అటువంటి సహాయలనేకం పొందిన వాళ్ళలో ఒకడు కావడంవల్లనే డిక్రీ అయి ఆర్నెల్లయినా ఇల్లు స్వాధీనం చేసుకోలేక పోయాడు సుబ్బయ్య శెట్టి.

ఓర్పుకు కూడా అంతం ఉంటుంది. రమణయ్య ఓర్పుకు ఇంకా అంతం రాకపోయినా, సుబ్బయ్య శెట్టి ఓర్పుకు అంతం వచ్చేసింది. ఫలానా తారీఖులోగా యివ్వకపోతే ఇల్లు వేలం వేస్తానని చెప్పేశాడు. ఆ ఫలానా తారీఖే రేపు!

అది యింటి వేలం కాదు. రమణయ్య పరువూ, మర్యాదా అన్నిటికీ వేలమే!

ఆ వేలాన్ని ఆపాలి! అంతే కాకుండా అనేకులు అప్పులవాళ్ళ పోరు వదుల్చుకోవాలి!! వీటి కోసమే రమణయ్య చక్కగా ఆలోచించాడు. ఒక నిశ్చయానికి వచ్చాడు. కష్టాల్లో ఉన్నా తన మెదడు బాగా పనిచేసిందే అనుకున్నాడు....

అందరి భోజనాలూ అయిపోయాయి. రమణయ్య భార్యను పిలిచాడు. జానకమ్మగారు నిద్రకు పడుతూంది. కొడుకోమూల కునికిపాట్లు పడుతూ ఏదో పుస్తకం చదువుతున్నాడు. ''తాయారూ, నేను పనిమీద అలా వెళ్తున్నాను. రేపు రావడం కొంచెం ఆలస్యమైనా కంగారు పడకు.''

''ఈ అర్థరాత్రి వేళ ఏం పనండీ!''

''నీకు తెలియదు. ఈ పనికి అర్థరాత్రే కావాలి. మరేం కంగారు పడకు. రేపట్నించి నిశ్చింతగా జీవించవచ్చు. తెలిసిందా? జాగ్రత్తగా ఉండండి. వెళ్తున్నాను.''

''ఇంత రాత్రి వెళ్లేబదులు రేపటిదాకా ఆగి వెళ్ళరాదూ?''

''ఆగడానికి వీల్లేదు.'' రమణయ్య గుమ్మందాకా వచ్చాడు.

గుమ్మం దాటుతూంటే అతని ఆత్మ'రేపటిదాకా ఆగు?' అంది. ఆత్మ తనను వెటకారం చేస్తూందేమో అనుకున్నాడు గానీ, పోనీ ఆగి చూద్దామనుకోలేదు రమణయ్య.

గుమ్మం దాటడానికి ఐదు నిమిషాలు పట్టింది. క్రమంగా నడక వేగం హెచ్చించి చీకట్లో కలిసిపోయ్యాడు రమణయ్య.

★ ★ ★

మర్నాడు.........

అప్పుడు ఎనిమిదిన్నరవుతుంది. తాయారమ్మ అప్పుడే స్నానం చేసి వచ్చి తల ఆరబోసుకుని బొట్టుపెట్టుకోబోతూంది.

''టెలిగ్రాం, సార్!'' అన్నాడు పోస్ట్‌మన్.

బొట్టు సీసా జారి క్రిందపడింది'అపశకునం!' అనుకుంది తాయారమ్మ. బొట్టు పెట్టుకోకుండానే పోస్ట్‌మన్ దగ్గరకు వెళ్ళింది. టెలిగ్రాం ఆవిడ పేరనే వచ్చింది. తెలుగులో సంతకం పెట్టి టెలిగ్రాం అందుకుంది. చేతులు వణికాయి. ఇంగ్లీష్ రాదు తనకు. అందులో ఏముందో ఏమో!

అదే సమయానికి ప్రకాశరావు వచ్చాడు. రమణయ్య అతన్నే కాదు, చాలా

మందిని ఈవేళ ఇంటికి రమ్మన్నాడు.

"బాబూ! ఈ టెలిగ్రాం కొంచెం చదివిపెడతావూ?"

ప్రకాశరావు అందుకుని చదివి కళ్ళు తేలవేశాడు."అబ్బా! రమణయ్యెంత నిఖార్సయిన మనిషి" అన్నాడు అప్రయత్నంగా.

"ఏమయిందండీ!" అంది కంగారుగా తాయారమ్మ.

"మీకు లాటరీలో లక్షా యాభై వేల రూపాయలు ప్రైజు వచ్చింది. ఈ విషయం చెప్పడానికే కాబోలు అందర్నీ ఈ వేళ రమ్మన్నాడు." ప్రకాశరావు మాటలు చెప్పి ఆగలేదు. ఈ శుభవార్త ఊళ్ళోని అప్పుల వాళ్ళందరికీ చెప్పడానికి వెళ్ళిపోయాడు.

'అందర్నీ రేపటిదాకా ఆగమన్నందుకు యిదన్నమాట కారణం' అనుకుంది తాయారమ్మ. అయితే తన భర్తకీ విషయం నిన్ననే తెలుసా? తెలిస్తే ఎందుకు చెప్పలేదు? ఇదేం ప్రమాదకరమైన విషయం కాదే!

తన పేరున ఆయన లాటరీ కట్టడం నిజమే! ఈ విషయం అత్తయ్యకు చెప్పాలి. తాయారమ్మ లోపలికి పరుగెత్తబోతుండగా అత్తగారి దగ్గర నుంచి పిలుపు వచ్చింది.

"తాయారూ! ఓసారిలాగరా!" ఆ గొంతులో కంగారు ఉట్టిపడుతూంది.

తాయారమ్మ హుషారుగా లోపలికి పరుగెత్తింది."అత్తయ్యా!" అని సంగతి చెప్పబోయి ఆగిపోయింది. అవిడచేతిలో ఏదో కాగితం ఉంది.

"ఇది వాడి తలగడా క్రింద ఉంది. ఏముందో కొంచెం చదువు. నాకేమిటో కంగారుగా ఉంది!" అందావిడ గాబరాగా.తాయారమ్మ గబగబా. ఆ కాగితం లాక్కుని కళ్ళతో ఓసారి చూసింది. అందులో ఏముందో ఏమో, పైకి చదవకుండానే"ఎంతపని చేశారు!"అంది. తరువాత అమెకు స్పృహ లేదు.

జానకమ్మగారికి కంగారెక్కువై పోయింది."ఒరేయ్ బాచిగా, ఇలారా" మనవడు పరుగెత్తుకు వచ్చాడు. పడిపోయిన అమ్మను చూసి కంగారుగా"మామ్మా!" అన్నాడు.

కోడలి చేతిలోని ఉత్తరం తీసి మనవడి చేతికిచ్చి"ఇది చదువు" అందావిడ. కుర్రాడు చదవసాగాడు."అమ్మకి నా నమస్కారాలు! అప్పులు తీర్చలేని అసమర్థుణ్ణి కావడంచేత వాళ్ళ నుంచి తప్పించుకుందుకు నేనీలోకం విడిచిపోతున్నాను. నాగురించి విచారించవద్దు. పొలం, ఇల్లూ తాయారు పేరునే ఉన్నాయి. దేవుడే మీకు మేలు చేస్తాడు.

"అయ్యో! ఎంతపని చేశావురా, నాయనా!" రాగాలు పెట్టసాగింది జానకమ్మ. అర్థం తెలియని మనవడు కూడా ఏడవసాగాడు. తాయారమ్మకు స్పృహ వచ్చింది. వెర్రిగా అటూయిటూ చూసింది.

టెలిగ్రాం ఆమెను వెక్కిరిస్తూంది. నడవలో పగిలిపోయిన కుంకం సీసా!

అంతమందిని రేపటిదాకా ఆపిన రమణయ్య తను రేపటిదాకా ఆగలేకపోయాడు.

★

*(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక - దీపావళి:: 20-11-1963)*